
# అలవాటు

ఆచంట హైమావతి




**పట్నం నుంచి వచ్చే రైలు దిగారు వాసుదేవ శాస్త్రి. ఎంత తొందరగా పూర్తి చేద్దామన్నా పనులన్నీ పూర్తయే సరికి మొదటి బండి దాటిపోయింది.**

"ఎలాగో బండి దాటిపోయింది కదా" అని దగ్గర్లో ఉన్న పినతల్లి కూతురింటికెళ్ళి, కొంచెం సేపుండి క్షేమం కనుక్కుని రెండో బండికి వచ్చారు. ఉదయం ఇంట్లో ఎప్పటి అలవాటు ప్రకారం పూజ పూర్తయ్యాక చెంబుడు పాలు తాగి పనుల మీద పట్నానికి బయలుదేరా రాయన. తిరిగి ఇంటికి చేరేవరకూ ఇంకే ఆహారం తీసుకోవటం అలవాటు లేదు. అలాగే అంగవస్త్రం కప్పుకోవటం తప్ప చొక్కాలు, లాల్చీల్లాంటివి తొడుక్కోవటం కూడా అలవాటు లేదు.

నాలుగో తరం... శాస్త్రిగారి పిల్లలు ఆధునికులు. శాస్త్రిగారు చేతి సంచి కూడా నారతో తయారైనదే వాడతారు. "అంతా ఫక్తు ఛాందస పద్ధతి. కాని ఆయన మనసు మాత్రం వెన్న. చాలా మంచి మనిషి" అంటారాయన్ని పూర్తిగా అర్థం చేసుకున్న అతికొద్దిమంది.

పల్లెలో జనసందడి చాలా తగ్గిపోయిందప్పుడే. ఉరుములు, మెరుపులతో హడావిడిగా ఉంది ఆకాశం. వీధి దీపాలు అక్కడొకటి, అక్కడొకటి మాత్రం వెలుగుతున్నాయి. ఆ చీకటిలో మెరుపులవల్ల మాత్రం కొంచెం దారి కనిపిస్తోంది. శాస్త్రిగారి ఇల్లు స్టేషన్‌కి దూరం కాకపోయినా అంత దగ్గరేం కాదు. వంతెన, అమ్మవారి గుడి, సంతపేట దాటితేనేగాని ఇల్లు దగ్గరపడదు. చేతి సంచిని చేతులు మార్చుకుంటూ, గాలికి చెదిరిపోతున్న అంగవస్త్రాన్ని సరిచేసుకుంటూ జాగ్రత్తగా నడుస్తూ "వాతావరణాన్ని తట్టుకోలేక గాబోలు జనం బొత్తిగా తిరగటం లేదు" అనుకున్నారాయన.

మెరుపుల వెలుగులో తనకి దగ్గర్లోనే, అయిదారడుగుల ముందు ఒక కుర్రాడు కూడా నడుస్తున్నట్లు కనిపించిందాయనకి. "ఇంత నిర్జనంగా ఉండగా వీడు మాత్రం ఎక్కడికెడుతున్నాడో ఇప్పుడు!" స్వగతంగా పైకే అనుకుని... "నాలాగే వెళ్ళిన పని తెమిలి ఉండదు" అని మనస్సులో అనుకున్నారు. ఎప్పుడెప్పుడు ఇంటికెళ్ళి చేరుదామా! అని ఉందాయనకి.

"కాఫీ, టీలు కాదులే అన్నయ్యా నేనిస్తూంట. లేత కొబ్బరి నీరు. నీ నిష్ఠ నాకు తెలుసుగా" అంటూ ఇచ్చిన చెల్లెలి ఇంట్లో తాగినది మినహా కడుపు ఖాళీగా శబ్దాలు చేస్తోంది. వయసూ పైబడుతోం దాయె!

చిటపట చినుకులు పడటం కూడా మొదలైంది. గాలి రివ్వు, రివ్వుమంటోంది. ఉరుములతో బాటు విపరీతమైన వెలుగుతో ఒక పెద్ద మెరుపు మెరిసింది. స్తంభానికీ, స్తంభానికీ మధ్యనున్న కరెంటు తీగ భగ్గున మండినట్లైంది. "ఢమ్" అనే శబ్దం చేస్తూ తీగ తెగి పడింది. ఇది ముందు వెడుతున్న కుర్రాడి మీద పడినట్లుంది. ఆ పిల్లాడు వెర్రికేక వేశాడు. ఆ క్షణాన్నే ఇళ్ళల్లోనూ, బయట లైట్లు ఆరిపోయాయి. ఆ పిల్లవాడి చేతిలోని వస్తువు

కత్తేమో నేలమీద పడ్డ చప్పుడయింది. పిల్లవాడు కొయ్యబారిపోయాడు.

శాస్త్రిగారు చేతి సంచిని గబగబ చంకకి తగిలించేసుకుని, ముందడుగేసి ఆ పిల్లాడ్ని అక్కున చేర్చుకున్నారు. విశాలమైన బాహువులతో ఆలింగనం చేసేసుకున్నారు. కుర్రాడు వణికిపోతున్నాడు. వాడి శరీరం శాస్త్రి గారి పరిష్వంగంలోకి మెల్లిగా జారిపోయింది. ఆయన తన అంగవస్త్రాన్ని ఆ బాలుడి చుట్టూ కూడా కప్పారు. ఒక చేత్తో వాడి ముఖాన్ని చేరదీసి తన మెడవంపులో దాచారు. ధైర్యం చెప్తున్నట్లూ రక్షణ కల్పిస్తున్నట్లూ రెండోచేత్తో వాడి వెన్ను నిమురుతూ ఉండిపోయారు.


పది నిమిషాలు గడిచేవరకూ ఆ ఇద్దరూ అదే స్థితిలో ఉండిపోయారు. అప్పటికి ఆ పిల్లాడు కొద్దిగా తేరుకున్నాడు. నెమ్మదిగా కదిలాడు. భయంతో వాడి ముఖం నిండా పట్టిన చెమటలు ఆయన మెడ దగ్గర స్పర్శిస్తున్నాయి.

"వీడికి షాక్ తగిలిందా?... షాక్ ఫీలై తెలివి తప్పాడా? కరెంటు తీగ తెగటం తను చూశాడు. అది వీడి మీద పడి ఉండదు. అలా పడితే వీడు బతికి ఉండేవాడు కాదు. ఇలా ఊపిరి ఆడేది కాదు గదా?!" అనుకుని తేలికగా నిశ్వశించారు శాస్త్రిగారు.

"అయితే...? ఆ తెగిన కరెంటు తీగని ఇంకెవరైనా తాకితే? అమ్మో!" అలా తోచిన వెంటనే గుండె ఆగినంత గాభరా వేసింది శాస్త్రి గారికి.

"ఎవరైనా బయటకి రండి. కరెంటు వైర్ తెగింది. టార్చి తీసుకురండి" రెండు మూడు సార్లు శక్తి మీరి అరిచారు శాస్త్రిగారు. మొదటి సారి ప్రకృతి చేస్తున్న అల్లరిలో వినిపించక పోయినా నిమిషం గడవకుండానే చుట్టు పక్కల రెండు, మూడిళ్ళ తలుపులు తెరుచుకున్నాయి. ఒక ఇంట్లోంచి బయటకొచ్చిన వ్యక్తి టార్చి తీసుకుని పరుగెత్తుకొచ్చాడు. చాలా పవర్‌ఫుల్ టార్చ్ అది. దాంతో చుట్టు పక్కలంతా కాంతి పరుచుకుంది.

"జాగ్రత్తగా చూసుకునిరా! అక్కడే వైరు తెగిపడింది." అతడి నుద్దేశించి శాస్త్రిగారు గట్టిగా అరిచారు. కంగారుతో ఆయన గొంతు జీరపోయింది. తడబడింది. గబగబ జనం చేరారు. జరగవలసిన అర్జంటు పని కోసం సైకిల్ మీద లైన్‌మేన్‌ని తీసుకురావటానికి వెళ్ళారు ఇద్దరు.



## మనోసౌందర్యం

**ప్రియా!**
**నీ కళ్ళ లోతుల్లోకి**
**చూస్తున్నప్పుడు**
**నాకు నా ప్రతిబింబం**
**కన్పిస్తోంది!**
**అయితే ఆశ్చర్యం**
**అందులో నా జెలసీ**
**కన్పించడం లేదు**
**ఫిల్టరు చేసిన**
**నీ మనోసౌందర్యానికి**
**శతకోటి వందనాలు!**

**- జి.జి.కె. రావు**

టార్చ్‌లైట్ వెలుతురులో శాస్త్రిగారి పరిష్వంగం నుంచి బయటపడినవాణ్ణి చూసి అందరూ ఆశ్చర్యపోయారు. వెలుగులో చూశాక ఛాందస స్వభావులైన శాస్త్రిగారి ప్రవర్తన ఎలా ఉంటుందోనని ఆందోళన చెందారు.

అందులోనూ... టార్చి తెచ్చిన వ్యక్తి శాస్త్రి గారి పద్ధతుల్ని దుయ్యబడ్తూ, హేళనచేస్తూ, వికృతంగా విమర్శించే సుందరం కావటంతో అందరూ తెల్లబోయారు. శాస్త్రిగారితో సుందరం ఎలా వ్యవహరిస్తాడో?! అని వ్యాకుల పడ్డారు. ఎందుకంటే.

ఆ పిల్లవాడు చెప్పులు కుట్టే మాదిగ మారెయ్య కొడుకు బెమ్మిగాడు.

"అయ్యో... వీణ్ణి మీరు..." కౌగలించుకున్నారా...? అని అడక్కుండా ఆపేశాడేగాని... ఆశ్చర్యపోయినట్లు నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుని నవ్వుకున్నాడు సుందరం. "ఇప్పుడీయన ఆచారం ఏమయినట్లు?" వెక్కిరింతగా అనుకున్నాడు.

బెమ్మిగాణ్ణి ఆదరించి, కాపాడిన శాస్త్రిగారు బ్రహ్మవిద్య అర్థం గ్రహించిన వారిలాగ నిరామయంగా, శాంతంగా ఉన్నారు.

బెమ్మిగాడి వెన్నుతట్టి "ఎవరైనా జతగా ఉండి ఇంటికి తీసుకెళ్ళండి. ఎవరికైనా ప్రాణ భయం, ఆపద, బాధ ఒకలాటివేగా! పాపం! పసివాడు బెదురుతో షాక్ అయ్యాడు." వివరించి చెప్పి ఇంటిదారి పట్టారు శాస్త్రిగారు.

ప్రాచీన సంప్రదాయం ఆయన అలవాటే గాని 'వివక్ష' లేదని గ్రహించాడు.

సుందరానికి శాస్త్రిగారి నిరాడంబర స్వరూపదర్శనం ప్రస్ఫుటంగా అర్థం అయిందీనాడు. "శాస్త్రిగారు జ్ఞాని. ఆయన మనస్సు వెన్న" అనే కొద్ది మందిలో సుందరం కూడా ఉన్నాడిప్పుడు.

ఇన్నాళ్ళూ కన్పించినప్పుడల్లా ఆయనపట్ల వ్యంగ్యంగా వ్యవహరించినందుకు మనసారా పశ్చాత్తాప పడ్డాడు సుందరం ఆ రాత్రం తాను. ❋

